

వలంటీర్ల తొలగింపు

రాయదుర్గం, జనవరి 2: ఎనిమిది మంది వలంటీర్లను తొలగిస్తూ మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలో ఉన్న వలంటీర్ల సంఘం అధ్యక్షుడు అజయ్, అంజి, రవితో పాటు మరో ఐదుగురిని తొలగించారు. వలంటీర్లకు వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సమ్మె చేయాలని భావిస్తున్న విషయాన్ని సోషియల్ మీడియాలో వీరు చర్చించినట్లు సమాచారం. ఈ కారణంగానే తొలగించినట్లు తెలిసింది. తొలగింపు పై వలంటీర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వర్తించనం దుకే తొలగించామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

'మానవ వనరుల ఉత్పాదక కేంద్రంగా జేఎన్‌టీయూ ఖ్యాతి విశ్వవ్యాప్తం. ఇక్కడ అభ్యసించే విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నతస్థానాలను అధిరోహిస్తున్నారు..' అని సభలు, సమావేశాల్లో వర్సిటీ ఉన్నతాధికారులు చెబుతుంటారు. ఇదేమీ వాస్తవదూరం కాదు. కానీ, ప్రతిష్టాత్మ వర్సిటీలో అంతర్గత వ్యవహారాలు వేరే లెవెల్‌లో ఉంటాయని విద్యార్థి, ఉద్యోగవర్గాలు అంటున్నాయి. జేఎన్టీయూఏ పరిధిలో 186 కళాశాలలు, లక్షలాదిమంది విద్యార్థులు, వందలాది మంది ఉద్యోగులు ఉన్నారు. ఇలాంటి వర్సిటీని కొన్ని అదృశ్య శక్తులు ఆక్రమించాయని వర్సిటీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కారణంగా ఉన్నతాధికారవర్గం రెండుగా చీలిపోయిందని అంటున్నారు. ఫలితంగా ఆకస్మిక బదిలీలు, ఆలస్యంగా ఉద్యోగోన్నతలు, ప్రశ్నించిన వారిపై తక్షణ చర్యలు వంటి కక్షసాధింపు చర్యలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. ప్రతిభకు, అర్హతకు పాతరేసి, తమకు నచ్చిన, భజన చేసేవారికే ఉద్యోగోన్నతలు, ఉన్నత పదవులు, కీలక స్థానాలు అదృశ్య శక్తి కట్టబెడుతోందని మండిపడుతున్నారు. మాట వినని ఉన్నతాధికార వర్గంపై ఆదాయ పన్ను శాఖకు, మంత్రులు, సీఎం, గవర్నర్‌కు లేఖలు రాస్తూ ఇబ్బంది పెడుతోందని అంటున్నారు.

అనంతపురం సెంట్రల్



వర్సిటీకి వైరస్..!

ఆడుకుంటున్న అదృశ్య శక్తులు!

ప్రశ్నించే వారిపై కక్ష సాధింపు

విద్యార్థులు, ఉద్యోగవర్గాలకు సంకటం

రెండు వర్గాలుగా జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు

ఉద్యోగోన్నతులు, బదిలీల్లో కనిపించని పారదర్శకత

ప్రశ్నిస్తే మూడినట్లే..



జేఎన్‌టీయూ పరిధిలో అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు ఉమ్మడి జిల్లాలలో ఇంజనీరింగ్ 78, ఫార్మసీ 41, ఎంసీ, ఎంబీఏ 67.. ఇలా మొత్తం 186 కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో లక్షలాది మంది విద్యార్థులు, వందలామంది ఉద్యోగులు ఉన్నారు. ప్రవేశాలు, పాఠ్యాంశాల రూపకల్పన, తరగతుల నిర్వహణ, ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ, మూల్యాంకణం, ఫలితాల విడుదల, సర్టిఫికెట్‌ల జారీ.. ఇలా అనేక అంశాల్లో పారదర్శకత పాటించాలి. కానీ ఉద్యోగులకు ఎప్పుడు బదిలీ వస్తుందో తెలియని పరిస్థితి. నిత్యం అభద్రత నడుమ విధులు నిర్వహిస్తున్నామని బాధితులు వాపోతున్నాయి. ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలకు బలికావాల్సి వస్తోందని అంటున్నారు. కళాశాల హాస్టల్లో భోజనంలో పురుగులున్నాయని ప్రశ్నించిన విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఉద్యోగ వర్గాల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగోన్నతలు కల్పించాలని, ఫలానా విభాగంలో అక్రమాలు జరుగుతున్నాయని ఎవరైనా గొంతువిప్పితే వారికి మూడినట్లేనని విద్యార్థి, ఉద్యోగవర్గాలు వాపోతున్నాయి. ఒక మాజీ వీసీ, రాష్ట్రస్థాయిలో కీలకంగా వ్యవహరిస్తున్న మరో అధికారి వర్సిటీని వెంటాడుతున్నారని అంటున్నారు. వర్సిటీలో ఉన్నతాధికారులను రెండు వర్గాలుగా చీల్చి, తమ అనుచరవర్గానికి, భజనచేసేవారికి అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. వీరికి మాత్రమే ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్‌లు లభించేలా చేస్తున్నారని అంటున్నారు. అభివృద్ధి పనుల కాంట్రాక్టులు, హాస్టల్ నిర్వహణ, సరకుల సరఫరా.. ఇలా ఏదైనా వారి వర్గానికి దక్కాల్సిందే అంటున్నారు. వర్సిటీలో కొందరు దశాబ్దాలుగా పాతుకుపోవడం ఇందుకు నిదర్శనమని అంటున్నారు.



గందరగోళంగా నిర్ణయాలు

వర్సిటీలో తాజాగా బోధనేతర సిబ్బంది బదిలీలు జరిగాయి. ఎగ్జామ్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న డీఆర్‌ను వర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌కు, ఇక్కడి ఫైనాన్స్ విభాగం డీఆర్‌ను ఎగ్జామ్ బ్రాంచ్‌కు బదిలీచేశారు. ఓటీపీఆర్ఐలోని ఏఆర్‌ను కలికిరికి బదిలీచేశారు. ఏమైందోగాని ఈ ఉత్తర్వులో అమలుకాలేదు. తిరిగి ఓటీపీఆర్ఐ వర్సిటీ అడ్మిస్ట్రేషన్‌కు, ఎగ్జామ్ బ్రాంచ్ డీఆర్‌ను ...ల ఫైనాన్స్ విభాగానికి బదిలీచేశారు. వాచ్‌మెన్ ... ఉద్యోగులు సంబంధిత విధుల్లో కాకుండా, వేర్వేరు ...గాల్లో ఇతర పోస్టుల్లో పనిచేస్తున్నారు. వీరిని వాచ్‌మెన్ పోస్టుల్లోకి తిరిగి పంపాలని జారీచేసిన ఉత్తర్వులు పనిచేయలేదు. కళాశాలలో స్వీపర్ పోస్టులోని ఒకరిని పరిపాలనా విభాగంలోకి మార్చారు. డైరెక్టర్, హెచ్ఓడీ, అసిస్టెంట్ ఎగ్జామినేషన్ కంట్రోలర్, పర్సనల్ అసిస్టెంట్.. ఇలా అన్ని పోస్టుల్లో గందరగోళ నిర్ణయాలు అమలౌతున్నాయి. అనుబంధ కళాశాలల ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ, హాస్టల్ నిర్వహణ తదితర వాటిలోనూ గందరగోళమే కనిపిస్తోందని ఉద్యోగ వర్గాలు వాపోతున్నాయి.





పొరపాట్లు సహజం..

వర్సిటీ అకడమిక్ అండ్ అడ్మినిస్ట్రేషన్ అంశాల్లో పారదర్శకంగా పనిచేసేందుకు కృషిచేస్తున్నాము. అనివార్య కారణాల వల్ల నిర్ణయాలను వెనక్కి తీసుకోవాల్సి వస్తోంది. 186 కళాశాలలు, లక్షలాదిమంది విద్యార్థులు, వందలాది మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్న వర్సిటిలో ఏదో ఒకచోట తప్పిదాలు చోటు చేసుకుంటాయి. బదిలీలు, ప్రమోషన్లు, ఉన్నత పదవులు, కీలక స్థానాల మార్పులో అర్హులకు చోటు కల్పించేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నాము. విద్యార్థులు, ఉద్యోగుల హక్కులను కాపాడుతున్నాం. ప్రశ్నించే స్వేచ్ఛను కల్పిస్తున్నాం.



- ప్రొఫెసర్ రంగజనార్ధన, జేఎన్‌టీయూ వీసీ



• సమస్యలను పరిష్కరించేదాకా సమ్మె

స్పష్టం చేసిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులు



జగన్, సజ్జల, మంత్రి సురేష్ వేషధారణతో నిరసన

అనంతపురం క్రైం, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేదాకా సమ్మె కొనసాగిస్తామని మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు స్పష్టం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు ఆధ్వర్యంలో అనంతపురం నగరపాలిక ఎదుట మంగళవారం ఎనిమిదోరోజు నిరసన కొనసాగించారు. సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ వేషధారులకు తమ సమస్యలను ప్రదర్శిస్తూ, కష్టాలను చెప్పుకున్నారు. జగన్ కొళాయి తిప్పితే నీరు రానట్లు, రోడ్ల మధ్య డివైడర్లలో మొక్కలు కత్తిరించే సమయంలో, వీధిలైట్లు వేసే సమయంలో తమకు ఎదురయ్యే ప్రమాదాలను ప్రదర్శించారు. తమ బతుకులు ఇలా ఉన్నాయని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుంతకల్లు, గుత్తి మున్సిపల్ కార్యాలయాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గడ్డి తింటూ నిరసన తెలిపారు.

• కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, జనవరి 2: కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. ప్రభుత్వం వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీసీసీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కార్మికులు పోరాటం చేయాల్సి రావడం బాధాకరమని అన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, అధికారంలోకి రాగానే ప్రత్యేక వైద్యపరమైన పరికరాలు అందిస్తామని, చెప్పిన జగన్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి పదవీకాలం ముగిసిపోతున్నా పట్టించుకోలేదని విమర్శించారు. పారిశుధ్య కార్మికుల సమ్మెతో రాష్ట్రం మొత్తం చెత్తతో కంపు కొడుతోందని అన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికార పార్టీ నాయకులకు వారి సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్మిలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. సమావేశంలో నాయకులు వాసు, ఫక్రుద్దీన్, ఇమామ్, పులిరాజ, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

• ఉద్యోగాలను రెగ్యులర్ చేయాల్సిందే

సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు, నేతలు

అనంతపురం విద్య, జనవరి 2: సమగ్రశిక్ష ఉద్యోగులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ విజయ్, ఇతర నాయకులు అన్నారు. సమ్మెలో భాగంగా 14వ రోజు మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన కొనసాగించారు. సమ్మె శిబిరంలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం కలెక్టరేట్ కూడలిలో ఉరి వేసుకుని నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు సునీత, మనోహర్, చైతన్య, లీలావతి, పుల్లారెడ్డి, శంకర్‌రెడ్డి, తిమ్మేష్, రామమోహన్, సుమంత్, లావణ్య, నాగరాజు, సాయి, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజీనామా పత్రం చూపుతున్న వైసీపీ ప్రజాప్రతినిధులు

దుర్గం వైసీపీలో మంటలు

కాపు టిక్కెట్ గల్లంతేనని ఆందోళన



రాయదుర్గం, జనవరి 2: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మంగళవారం రాత్రి తాడేపల్లికి బయలుదేరారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పు రెండో జాబితా విడుదల చేసిన నేపథ్యంలో కాపు మద్దతుదారులు తమ నాయకుడికి టిక్కెట్ దక్కదన్న ఆందోళనతో మూకుమ్మడి రాజీనామాలకు తెరలేపారు. దీంతో పార్టీ అధినాయకత్వం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా ఫోన్ చేయించి, కాపును ఓదార్చే ప్రయత్నం చేసినట్లు సమాచారం. కానీ తనకు టిక్కెట్ ఇచ్చి తీరాల్సిందేనని కాపు గట్టిగా కోరడంతో అనుచరులతో కలిసి తాడేపల్లికి రావాలని సజ్జల సూచించినట్లు తెలిసింది. దీంతో మద్దతుదారులతో కలిసి కాపు తాడేపల్లికి బయలుదేరారు.

మెట్టుకు టిక్కెట్ ఇస్తే రాజీనామా చేస్తాం..

మెట్టు గోవిందరెడ్డికి టిక్కెట్ ఇస్తే పార్టీకి రాజీనామా చేస్తామని వైసీపీలోని కాపు రామచంద్రారెడ్డి వర్గీయులు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సోషల్ మీడియాలో పోస్టులు, రాజీనామాలు పత్రాలు, ఫొటోలను పెట్టారు. పార్టీ డి.హీరేహాళ్ మండల కన్వీనర్ వన్నూరుస్వామి, మార్కెట్‌యార్డు చైర్మెన్ భోజరాజనాయక్, ఎంపీపీ పవిత్ర, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి టిక్కెట్ ఇవ్వని పక్షంలో మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని ప్రకటించారు. మెట్టు గోవిందరెడ్డికు టిక్కెట్ ఇస్తున్నారన్న సమాచారం అందడంతోనే రాజీనామాలు చేస్తున్నామని స్పష్టం చేశారు. దీంతో నియోజకవర్గంలో ప్రకంపనలు మొదలయ్యాయి. పార్టీ తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే కాపు రామచంద్రారెడ్డి కూడా పార్టీతో పాటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారని అంటున్నారు. అయితే, ఇప్పటివరకు ఎమ్మెల్యే టిక్కెట్ విషయంలో వైసీపీ అధినాయకత్వం స్పష్టత ఇవ్వలేదు.

రెండు రోజులుగా గుబులు

రాయదుర్గం టిక్కెట్‌ను ఏపీఐఐసీ చైర్మెన్ మెట్టు గోవిందరెడ్డికి ఇస్తారని తెలియడంతో విప్ కాపు రామచంద్రారెడ్డి శిబిరంలో రెండురోజులుగా ఆందోళన మొదలైంది. కాపు నివాసంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి పార్టీ శ్రేణులతో సుదీర్ఘ మంతనాలు జరిగాయి. చివరకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాలని, అధినాయకత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ దిశగా రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముందుగా డి.హీరేహాళ్ మండలం నుంచి రాజీనామాల పరంపర ప్రారంభించి, నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి రాజీనామాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

వైసీపీ ఇన్‌చార్జిల మార్పు





- అనంత ఎంపీ స్థానానికి శంకరనారాయణ
- పురం ఎంపీ స్థానానికి జోలదరాశి శాంత
- సిట్టింగ్ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు రిక్తహస్తం
- పెనుకొండకు మంత్రి ఉష శ్రీచరణ్ బదిలీ
- కళ్యాణదుర్గం ఇన్‌చార్జిగా తలారి రంగయ్య
- కదిరి ఇచ్‌చార్జిగా రియల్టర్ మక్బూల్ అహ్మద్

7లో



పెట్రోల్ బంకులు కిటకిట

అనంతపురం టౌన్, జనవరి 2: కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ మంగళవారం రాత్రి 8 గంటల నుంచి పెట్రోల్ ట్యాంకర్ల యజమానులు బంద్‌కు వెళుతున్నారన్న ప్రచారం కలకలం రేపింది. అనంతపురం నగరంలోని పెట్రోలు బంకులన్నీ మంగళవారం రాత్రి కిటకిటలాడాయి.

తెలంగాణలో పెట్రోల్ కోసం ఇప్పటికే జనం అవస్థలు పడుతున్నారని మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో జిల్లావాసులు ఆందోళనకు గురయ్యారు. పెట్రోల్ కొరత తలెత్తితే ఇబ్బందులు పడతామని భావించి, చాలా మంది ట్యాంక్ ఫుల్ చేయించుకున్నారు. ఈ ప్రచారాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు ఖండించారు. అలాంటి సమాచారం ఏదీ రాలేదని అన్నారు.



పెట్రోలు బంకుల వద్ద బారులు తీరిన వాహనదారులు

• భిక్షమెత్తిన అంగన్‌వాడీలు

సీఎం జగన్ తీరుపై విమర్శలు

అనంతపురం విద్య, జనవరి 2: డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. అనంతపురంలో సమ్మె 22వ రోజు మంగళవారం ఇంటింటికీ తిరిగి భిక్షమెత్తారు. జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగించారు. నగరంలోని పలు కాలనీల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భిక్షం అడిగారు. సీఎం జగన్ కారణంగా తమకు ఈ దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం కనిపించడం లేదని నాయకులు మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతుంటే జగన్ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. బొమ్మనహాళ్, గార్లదిన్నె తదితర ప్రాంతాల్లో గేదెలు, ఆవులు, దున్నపోతులకు వినతిపత్రాలు అందించారు.



వాహనచోదకుణ్ని భిక్షం అడుగుతున్న అంగన్వాడీలు

ఆందోళనకు అనుమతి ఉందా..?



పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

కళ్యాణదుర్గం, జనవరి 2: పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేసేందుకు మీకు ఎవరు అనుమతిచ్చారని సీఐ హరినాథ్ అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రశ్నించారు. దీంతో మంత్రి ఇలాఖాలో ఆందోళన చేయడానికే అనుమతి లేదా అంటూ సీఐని అంగన్‌వాడీ కార్యకర్తలు నిలదీశారు. బుక్కరాయసముద్రం మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించినందుకు నిరసనగా దుర్గం పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. స్టేషన్ వద్దకు ర్యాలీగా వెళ్లి.. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐ హరినాథ్ అక్కడకు చేరుకుని అంగన్‌వాడీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సీఐపై మహిళలు తిరగబడ్డారు. మంత్రి ఇంటి ముట్టడికి వెళుతున్న సమయంలోనూ ఇలాగే వ్యవహరించారని, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు తమకు లేదా అని ప్రశ్నించారు. దీంతో ఆయన వినతిపత్రం తీసుకుని వెళ్లిపోయారు.

వినే ఓపిక కూడా లేదా..?

యాడికి, జనవరి 2: మండల కేంద్రంలో భూ పట్టాలను పంపిణీ చేసి వెళుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డికి తమ సమస్యలను విన్నవించాలని వెళ్లిన అంగన్‌వాడీలకు నిరాశ ఎదురైంది. ఎమ్మెల్యే తన వాహనాన్ని మంగళవారం నిలబెట్టకుండా వెళ్లిపోయారు. దీంతో తమ సమస్యలు వినే ఓపిక కూడా లేదా అని ఎమ్మెల్యేపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేని కలిసేందుకు చింతవనం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రధాన రహదారిపైకి అంగన్‌వాడీ వర్కర్లు వెళ్లారు. పోలీసులు అడ్డుకుని, ఎమ్మెల్యే ఇంటివద్దకు వెళ్లాలని సూచించారు. అంగన్‌వాడీలనూ గమనిస్తూనే ఎమ్మెల్యే పెద్దారెడ్డి అలాగే వెళ్లిపోవడం విమర్శలకు తావిచ్చింది.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్

అనంతపురం టౌన్/బుక్కరాయసముద్రం, జనవరి 2 : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనకు రానున్న సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టరు గౌతమి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గవర్నర్ పర్యటనపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల6న గవర్నర్ బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన 'వికసిత్ భారత్' సంకల్పయాత్ర కార్యక్రమంలో పాల్గొంటారని, సమావేశానికి పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని, అన్ని శాఖల సమన్వయంతో ఎలాంటి లోపాలకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ విజయభాస్కర రెడ్డి, డీఆర్ఓ గాయత్రీదేవి. ఆర్డీఓ గ్రంథి వెంకటేష్, డీపీఓ ప్రభాకరరావు, డీఆర్‌డీఏపీడీ, ఐసీడీఎస్‌పీడీ, డ్వామా పీడీ, పీఆర్ ఎస్ఈ పాల్గొన్నారు.

● గవర్నర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జేసీ కేతన్ గార్గ్ బుక్కరాయసముద్రంలో పరిశీలించారు. సభావేదిక, పార్కింగ్, భద్రతపై అధికారులకు పలు సూచనలు చేశారు. డీఎస్పీ శివారెడ్డి, డీపీఓ ప్రభాకర్ రావు, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్ గౌతమి



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

సొంతపార్టీ నేతలే విసిగి పోయారు

- వైసీపీ ఖాళీ కావడం ఖాయం
- మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, జనవరి 2: సొంత పార్టీ నేతలే వైసీపీ ప్రభుత్వంపై విసిగిపోయారని, మరో మూడు నెలల్లో వైసీపీ పూర్తిగా ఖాళీ అవుతుందని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. మంగళవారం మాజీ మంత్రి పరిటాల సునీత స్వగృహంలో ఎంసీపల్లి పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ కీలక నేతలు, సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి ఆధ్వర్యంలో పరిటాల సునీత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పరిటాల సునీత పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి వైఖరి నచ్చక ప్రభుత్వ విధానాలను నచ్చక తామంతా పార్టీ వీడనట్టు వారు చెబుతున్నారన్నారు. ప్రభుత్వంపై ప్రజలలోనే కాకుండా సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల్లోకూడా తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుందన్నారు. మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, నియోజకవర్గంలో ఎమ్మెల్యేసోదరుల దౌర్జన్యాలు, వారి చర్యలతో చాలా మంది విసిగిపోయి టీడీపీలోకి వస్తున్నారన్నారు. మరో నెల రోజుల్లో ఇంకా చాలా మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరే అవకాశం ఉందని, టీడీపీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని, ప్రతి ఒక్కరూ చంద్రన్నను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేయలని సూచించారు. అస్తవ్యస్థంగా మారిన ఏపీ మళ్లీ అభివృద్ధి బాటలో నడవాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. వైసీపీ పాలనతో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, మాజీ సర్పంచ్ ముత్యాలు, మారుతీప్రసాద్, మంగాపురం ఆదినారాయణ, రాదాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారు వీరే: గరిమేకలపల్లికి చెందిన కురుబ మారుతీప్రసాద్, లింగమయ్య, రమేశ్, గలగల నరసింహులు, కుమార్, కురుబ బాబు, మాలశంకర్, మాల గోపాల్, గొల్లశివకుమార్, ఎంసీపల్లికి చెందిన బోయ రామాంజినేయలు, ఎం నారాయణ, ముత్యాలప్ప, పెద్ద నరసింహుడు, గురుప్రసాద్, చిన్న నరసింహులు టీడీపీలో చేరారు.

వైసీపీలో కొత్త మంటలు..!

ఇన్‌చార్జిల మార్పుతో శ్రేణుల్లో ఆగ్రహావేశాలు

- అనంతపురం ఎంపీ స్థానానికి శంకరనారాయణ
- పురం ఎంపీ స్థానానికి శ్రీరాములు చెల్లెలు శాంత
- సిట్టింగ్ ఎంపీ గోరంట్ల మాధవ్ గల్లంతు
- కదిరిలో సిద్దారెడ్డి ఔట్.. రియల్టర్ మక్బూల్ ఇన్
- పెనుకొండకు మంత్రి ఉష శ్రీచరణ్ బదిలీ
- కళ్యాణదుర్గం ఇన్‌చార్జిగా తలారి రంగయ్య















అనంతపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జుల మార్పులు, చేర్పులతో అధికార పార్టీ శ్రేణుల్లో ఆగ్రహ జ్వాలలు రేకెత్తాయి. పార్టీ నిర్ణయాన్ని సిట్టింగ్ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. అధినాయకత్వం నిర్ణయంపై ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మంత్రి బొత్స సత్యనారాయణ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల జాబితాను మంగళవారం రాత్రి విడుదల చేశారు. ఈ జాబితాలో కొందరికి సీట్లు గల్లంతయ్యాయి. దీంతో ఆ వార్గల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. సీట్లు కోల్పోతున్న ఎమ్మెల్యేలకు మద్దతుగా అనుచరవర్గం రాజీనామాలకు వెనుకాడటం లేదు. రచ్చకెక్కి రాజీనామా చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ మాత్రమే మంగళవారం రాత్రి నిర్ణయం ప్రకటించారు. దీంతో కదిరి, పెనుకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో అసంతృప్తులు పెల్లుబుకాయి. రోడ్ల మీదకొచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. స్థానికేతరులు ఏ విధంగా గెలుస్తారో చూస్తామని అంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అయితే.. తమకు కొత్త ఇన్‌చార్జిలు వద్దే వద్దని అంటున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల మార్పు వైసీపీలో పోను పోనూ మరింత రాజుకునేలా కనిపిస్తోంది.

వీరే ఇన్‌చార్జిలు..

రాష్ట్రవ్యాప్తంగా 27 పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమిస్తూ వైసీపీ ఓ జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా జోలదరాశి శాంతను నియమించారు. అనంతపురం పార్లమెంటు నియోజకవర్గానికి పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శంకర్ నారాయణను నియమించారు. కదిరి నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి స్థానంలో కదిరికి చెందిన రియల్ వ్యాపారి బీఎస్ మక్బుల్ అహమ్మద్‌ను నియమించారు. పెనుకొండ నియోజకవర్గానికి కళ్యాణదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఉష శ్రీచరణ్‌ను నియమించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను నియమించారు.

కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ సీట్లు గల్లంతైనట్టేనని స్పష్టంగా అర్థమవుతోంది.

పొమ్మనలేక పొగ..

పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ పెనుకొండ నుంచే పోటీ చేయాలని భావించారు. కానీ పార్టీ అధినాయకత్వం ఆయనను అనంతపురం ఎంపీగా పోటీ చేయాలని ఆదేశించింది. దీంతో ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరవర్గం తీవ్ర అసంతృప్తికి లోనైనట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయనను అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం.. పొమ్మనలేక పొగబెట్టినట్లుగా ఉందని ఆయన అనుచరవర్గం అంటోంది. శంకర నారాయణ సామాజికవర్గాన్ని ప్రామాణికంగా తీసుకుని ఉంటే... హిందూపురానికి కాకుండా అనంతపురం పార్లమెంటు నియోజకవర్గానికి ఎలా పంపుతారని ఆయన సామాజికవర్గం ప్రశ్నిస్తోంది. పార్టీ నిర్ణయంపై శంకర్ నారాయణ సామాజికవర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

స్థానికేతరులకా...?

హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా శాంత నియామకాన్ని అధికార పార్టీలోని కొందరు ముఖ్యులు తప్పుబడుతున్నారు. బోయ సామాజికవర్గానికి చెందిన వారిని హిందూపురం పార్లమెంటు ఇన్‌చార్జిగా నియమించాలని పార్టీ అధిష్ఠానం భావిస్తే... పార్టీ ఆవిర్భావం నుంచి కష్టకాలంలోనూ పని చేస్తున్న బోయ నేతలు పార్టీ అధినాయకత్వానికి కనిపించలేదా అని ఆ సామాజికవర్గంవారు ప్రశ్నిస్తున్నారు. స్థానికులకు కాకుండా పొరుగు రాష్ట్రం నుంచి అరువు తెచ్చుకోవడం ఏమిటని నిలదీస్తున్నారు. స్థానికేతరులను హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించడాన్ని ఆ సామాజికవర్గం నేతలే జీర్ణించుకోలేకపోతున్నారు. తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో బోయ సామాజికవర్గం నేతలే లేరా అని అధినాయకత్వాన్ని ఆ సామాజికవర్గంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

జోలదరాశి శాంత ఎవరు..?



హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బోయ సామాజికవర్గానికి చెందిన జోలదరాశి శాంతను వైసీపీ నియమించింది. సీఎం జగన్ సమక్షంలో మంగళవారం సాయంత్రం ఆమె వైసీపీలో చేరారు. ఆ తరువాత గంటల వ్యవధిలోనే హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆమెను నియమించారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాకు చెందిన శాంత, బీజేపీ మాజీ ఎంపీ శ్రీరాములు సోదరి. 2009లో శాంత బళ్లారి పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి గెలిచారు. వైసీపీతో ప్రత్యేక సంబంధాలున్న అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన కీలక నేతల ద్వారా శ్రీరాములు తన సోదరిని ఏపీ రాజకీయాల్లోకి ప్రవేశం చేయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే శాంత వైసీపీ తీర్థం పుచ్చుకున్నారని, ముందస్తు ఒప్పందం మేరకు హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ప్రకటించారని సమాచారం.



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానిస్తున్న జేఎన్‌టీయూ వీసీ

స్నాతకోత్సవానికి రండి

- గవర్నర్‌కు వీసీ ఆహ్వానం

అనంతపురం సెంట్రల్, జనవరి 2: జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవానికి రావాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను వీసీ రంగజనార్ధన ఆహ్వానించారు. ఈ మేరకు విజయవాడకెళ్లి గవర్నర్‌ను కలిసి ఆహ్వానం పలికినట్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. వేడుకల నిర్వహణ, గౌరవ డాక్టరేట్ ప్రదానం, గోల్డ్‌మెడల్స్ అందజేత తదితర అంశాలపై చర్చించామన్నారు.

పశువులకు టీకా వేయించండి

అనంతపురం అర్బన్, జనవరి 2 : పశువులకు వేసే గాలి కుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు 3,65,300 గాలికుంటు వ్యాధి టీకాల డోస్‌లు వచ్చాయని, ఈనెలాఖరు దాకా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నాలుగు నెలల వయస్సు దాటిన పశువులకు టీకాలు వేస్తామని తెలిపారు. రైతులు స్థానిక పశు వైద్యులను సంప్రదించాలని సూచించారు.

కరోనా పాజిటివ్ కేసులు నిల్

అనంతపురం టౌన్ జనవరి 2: జిల్లాలో నాలుగు రోజులుగా కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాలేదు. మంగళవారం డాక్టర్ల సూచనలమేరకు ఆస్పత్రికి వచ్చిన 42 మందికి శాంపిల్స్ తీసి నిర్ధారణ పరీక్షలకు పంపామని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. అయితే అందరికీ నెగిటివ్ వచిందని పాజిటివ్ కేసులు రాలేదని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఆస్పత్రిలోని కొవిడ్ వార్డులో చికిత్స పొందుతున్న అనంతనగరవాసి సైతం ఆరోగ్యంగా కోలుకోవడంతో డిశ్చార్జ్ అయ్యారని సూపరింటెండెంట్ తెలిపారు. అనుమానపు లక్షణాలతో ఆస్పత్రికి వస్తే ఓపీ డాక్టర్లు సూచించిన వారికి మాత్రమే కొవిడ్ టెస్టులు చేస్తున్నామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

జిల్లా అటవీశాఖ అధికారిగా వినీత్ కుమార్

అనంతపురం న్యూటౌన్, జనవరి 2: జిల్లా అటవీశాఖ అధికారి సందీప్ కృపాకర్ నెల్లూరు జిల్లా అటవీశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాల డీఎఫ్‌ఓగా ఉన్న వినీత్ కుమార్‌ను నియమించారు. దీంతో ఆయన జిల్లా అటవీశాఖ అధికారిగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్‌ను పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పచ్చదనం పెంపుతో పాటు నర్సరీల అభివృద్ధికి తమవంతు చర్యలు చేపడతామన్నారు. దీంతో పాటు అటవీస్థలాల్లో అక్రమణలకు పాల్పడితే సహించేది లేదన్నారు. పచ్చదనం, పర్యావరణం కాపాడడానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

తోలుబొమ్మలాట కళాకారుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న కళాకారుడు చిదంబరరావు

ధర్మవరం, జనవరి 2: మండలంలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలు బొమ్మలాట కళాకారుడు చిదంబరరావు బెంగుళూర్‌లని హోసూరు సిటీలో ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్‌రీసెర్చ్ అకాడమీ చైర్మన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాకారుడు చిదంబరరావు మాట్లాడుతూ...తన పూర్వీకుల నుంచి తోలుబొమ్మలాట తయారీచేయుట, ప్రదర్శనలు చేయుట చిన్నతనం నుంచే నేర్చుకున్నానని, తన ప్రగతిని గుర్తించి కర్ణాటక ప్రభుత్వం డిసెంబరు 30న హోసూరులో అవార్డు అందజేసిందన్నారు. అవార్డు రావడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇప్పటి వరకు 25 అవార్డులను పొందానన్నారు.

7న జిల్లా స్థాయి రెడ్డి సంఘం 'ఆత్మీయసభ'

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2: ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7వతేదీన 'ఆత్మీయసభ' నిర్వహించనున్నారు. నగరంలోని న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో సభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలో పేదలకు ఆర్థికంగా, విద్య, వైద్యరంగాలలో అవకాశాలు కల్పించేవారికే ఎన్నికల్లో మద్దతు ఇస్తామన్నారు. ఏపీ రెడ్డిసంఘం గౌరవాధ్యక్షుడు బయపురెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి, కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, నగర అధ్యక్షుడు హనుమంతరాయరెడ్డి, నాయకులు భాగ్యలక్ష్మీరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నితిన్‌రెడ్డి, నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్డిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కుమార్ రెడ్డి

జీతాల కోసం శ్రీరామిరెడ్డి కార్మికుల నిరసన



శ్రీరామిరెడ్డి పంపుహౌస్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేపట్టిన కార్మికులు

కళ్యాణదుర్గం, జనవరి 2: పట్టణంలోని శ్రీరామిరెడ్డి పంపుహౌస్ వద్ద కార్మికులు మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. తమకు జీతాలు అందేంత వరకు ఇలాగే నిరసన కార్యక్రమాలు చేపడతామని కార్మికులు హెచ్చరించారు. మంగళవారం పంపుహౌస్‌కు తాళాలు వేసి నిరసన పాటించారు. ఫేజ్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో పనిచేస్తున్న 225 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రభావంతో సుమారు 325 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని వారు తెలిపారు. ఐదు నెలలుగా జీతాలు అందడం లేదని, తమ కుటుంబాలు గడవటమే కష్టంగా ఉందని వాపోయారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు నిరసనలు ఆపేది లేదని, తమ సమస్యలు పట్టించుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 2: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థుల పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తన కార్యాలయంలో విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరులో బీటెక్ ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్ పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నా రు. ఫలితాల వివరాలకు కళాశాల అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ విష్ణువర్ధన్, లలిత, విభాగాధిపతులు కేఎఫ్ భారతి, అజిత, కళ్యాణిరాధ, శైలాకుమారి, మారాల రామశేఖరెడ్డి, దిలీప్‌కుమార్, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

6న జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2: యువతకు ఈనెల 6వతేదీన కలెక్టరేట్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో జిల్లా స్థాయి వక్తృత్వపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 15-29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువత 3నిముషాల నిడివితో 'భారత్-వికసిత్ భారత్2047' అంశంపై ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషల్లో ప్రసంగించాలని, జిల్లా స్థాయిలో గెలుపొందిన యువత రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులన్నారు. ఉత్తమ వ్యాఖ్యానంతో, సరైన అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులను, యువతను ప్రోత్సహించడమే ధ్యేయంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి ఇద్దరికి రూ.25వేలు చొప్పున అందజేస్తారన్నారు. ఆధార్‌కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849871174ను సంప్రదించాలని కోరారు.

నిరుద్యోగులకు నైపుణ్యశిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు బైకు రిపేరీలో నైపుణ్య శిక్షణా, ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. బైకు రిపేరీ కోర్సులో సాంకేతికత నైపుణ్య శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. 45రోజుల పాటు ఇచ్చే శిక్షణకు 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 8, 9, వ దోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివి ఉండాలని, శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థికి టూల్‌కిట్, సర్టిఫికెట్ అందజేస్తామని, సెల్ నంబర్లు 9390505952, 7780752418లను సంప్రదించాలన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

గార్లదిన్నె, జనవరి 2 : మండలంలోని కల్లూరు గ్రామంలో ఆటో డ్రైవర్ గొల్ల ధనుంజయ (36) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన ఆటో నడుపుకుంటు కుటుంబాన్ని పోషించుకునేవాడు. అప్పులు అధికం కావడంతో తీర్చే మార్గం లేక సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. ధనుంజయకు భార్య, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

జగన్ ఓటమే లక్ష్యం : పీడీఎస్‌యూ



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు శంకర్

అనంతపురం సెంట్రల్, జనవరి 2: ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్.. ఆ తర్వాత దాన్ని పూర్తిగా విస్మరించి నిరుద్యోగ యువతకు అన్యాయం చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో జగన్ ఓటమే లక్ష్యంగా యువత పని చేయాలని పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు బండారు శంకర్ సూచించారు. మంగళవారం జగన్‌బాబు జాబ్ క్యాలెండర్ ఎక్కడంటూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరుద్యోగులు నగరంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ.. నిరుద్యోగులను ఆదుకునేలా జగన్‌రెడ్డి ఏ కార్యక్రమాన్ని చేపట్టలేదని ధ్వజమెత్తారు. నాయకులు బాలు, నరేష్, ఓబులేసు, సాయిధరమ్, తేజ్, వెంకటేష్, వేమన, కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనంతపురంరూరల్, జనవరి 2: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా ఉండబోదని విద్యుత్ శాఖ డి-6 సెక్షన్ ఏఈఈ ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు మార్కెట్ యార్డు సబ్ స్టేషన్ పరిధిలోని వేణుగోపాల్‌నగర్, వినాయక్‌నగర్, నీరుగంటి వీధి, బస్టాండ్ రోడ్డు, జనచైతన్య కాలనీ, సోములదొడ్డి రోడ్డు, హమాలి కాలనీ, భాగ్యనగర్, విరూపాక్ష నగర్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ

అనంతపురంరూరల్, జనవరి 2: స్థానిక గుత్తి రోడ్డులోని రైస్‌మిల్లులను, స్టాక్ పాయింట్లను అనంత వ్యవసాయ మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి విజయలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్‌ను పరిశీలించారు. వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. వ్యాపారులు తప్పని సరిగా లైసెన్సులు తీసుకోవాలని ఆమె సూచించారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు నాగేంద్ర, కేశవకుమార్ ఉన్నారు.

పశువులకు టీకాలు

అనంతపురంరూరల్, జనవరి 2: మండలంలోని కందుకూరు గ్రామంలో పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం మంగళవారం నిర్వహించారు. ఇందులో డిడి రమేష్‌రెడ్డి, పశువైద్యాధికారిని ఉష, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం తప్పదు

అనంతపురం సెంట్రల్, జనవరి 2: ప్రజల మలమూత్రాలు ఎత్తివేసి వీధులు శుభ్రం చేసే కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో పతనం తప్పదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కొనసాగుతున్న కార్మికుల నిరధిక సమ్మెకు మంగళవారం మద్దతు తెలిపిన ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది, కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో ముఖ్యమంత్రిగా జగన్ విఫమలయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, శేష్, కోమటి, నాగేంద్ర, రామకృష్ణ, ఓబులేసు, మద్దిలేటి, వెంకటేష్ పాల్గొన్నారు.

ముంటిమడుగు ఆర్థిక సాయం

గార్లదిన్నె, జనవరి 2: గార్లదిన్నె, శింగనమల మండలాలకు చెందిన ఇరువురికి శింగనమల నియోజవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి రూ. 20వేలు ఆర్థిక సాయం అందచేశారు. బూదేడు ఎస్సీకాలనీకి చెందిన రామాంజినేయులుకు వైద్యం ఖర్చులకు రూ. 10వేలు, బండమీదపల్లికి చెందిన గంగమ్మ కుమారుడి వివాహానికి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అనంతపురం న్యూటౌన్, జనవరి 2: శింగనమల బీట్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను రేంజర్ శ్రీనివాసులు డీఆర్వో ఉసేనప్పతో కలిసి మంగళవారం పరిశీలించారు. అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెరిగిన ప్రతి చెట్టును కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానిక సిబ్బందిపై ఉందన్నారు.

ఉద్యమకారుడు దశరథరామిరెడ్డి అరెస్టు

జగన్ నియంత పాలనకు నిదర్శనం

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు

అనంతపురంఅర్బన్, జనవరి 2: రాయలసీమ సాగునీటి ఉద్యమకారుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అక్రమ అరెస్టు జగన్ నియంత పాలనకు నిదర్శనమని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. దశరథరామిరెడ్డి అరెస్టును ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్షాల మీద దాడులు, ప్రజా సంఘాలు, రాయలసీమ ఉద్యమకారుల అక్రమ అరెస్టులపై పెట్టిన శ్రద్ధ... సీమ సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయడం మీద పెట్టి ఉంటే సీమ చాలా అభివృద్ధి చెందేదన్నారు. అధికారంలోకి వచ్చినాటి నుంచి తనను ప్రశ్నంచడాన్ని ఏ మాత్రం తట్టుకోలేకున్న నియంత జగన్‌మోహన్‌రెడ్డి అదే తీరును కొనసాగిస్తూ బొజ్జా దశరథరామిరెడ్డి అరెస్టు చేశారన్నారు. సిద్దేశ్వరం అలుగు పైన అలుపెరగని పోరాటం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేయడం అంటే సీమ రైతాంగం గొంతు నొక్కడమేనన్నారు. సిద్దేశ్వర అలుగు స్థానంలో కేబుల్ బ్రిడ్జ్ నిర్మించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం వ్యతిరేకించకుండా, రాయలసీమ రైతాంగం నోట్లో జగన్‌రెడ్డి మట్టికొట్టారన్నారు. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిద్దేశ్వరం అలుగు నిర్మాణం అవసరాన్ని వాడవాడలా తిరిగి సీమ రైతుల్లో కేవలం అవగాహన కల్పిస్తున్నారే కక్షతోనే రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడైన దశరథరామిరెడ్డిని అక్రమంగా అరెస్టు చేయించారని మండిపడ్డారు.

ప్రభుత్వ జాబ్ క్యాలెండర్‌కు కర్మకాండ

అనంతపురం అర్బన్, జనవరి 2: తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వ జాబ్ క్యాలెండర్‌కు కర్మకాండ చేశారు. మంగళవారం బుక్కరాయసముద్రం చెరువులో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు లక్ష్మీన రసింహ తదితరులు సీఎం జగన్ ప్రభుత్వ జాబ్ క్యాలెండర్ అమలు చేయకపోవడానికి వ్య తిరేకంగా జాబ్ క్యాలెండర్‌కు సాంప్రదాయ బద్ధంగా పిండం పెట్టి కర్మ కాండ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, వడ్డే నాగేంద్ర, అనిల్, లక్ష్మీనారాయణ, సుధాకర్, సా దిక్, శివ, రామాంజి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



జాబ్ క్యాలెండర్‌కు కర్మకాండ చేస్తున్న నాయకులు

ఇల్లు కట్టేదెలా... జగనన్నా..?



కొడిమి గ్రామ సమీపంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఉన్న రాళ్లు, పెరిగిన కంపచెట్లు

- కొడిమి సమీపంలో పలువురికి ఇళ్ల పట్టాలు
- ఆ స్థలాల్లో పెద్ద పెద్ద రాళ్లు, ముళ్లకంపలు
- భూమిని సిద్ధం చేయకుండానే పట్టాలు ఇచ్చిన వైనం

అనంతపురంరూరల్, జనవరి 2: ఇటీవల పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించిన భూమిని చూస్తే ఎవరైనా అవాక్కు కావాల్సిందే. ఆ భూముల్లో పెద్ద పెద్ద రాళ్లు ఉండటంతో పాటు... మొత్తం ముళ్ల కంపలతో నిండి ఉంటున్నాయి. కనీసం ఇళ్ల స్థలాలకు ఇచ్చిన భూమి చూసేందుకు వెళ్లాలన్నా వీలుకాని పరిస్థితి ఉంది. కనీసం నడుచుకుంటూ వెళ్లేందుకూ వీలు లేని విధంగా ఉంది. ఇక తమ స్థలం ఎక్కడుందో.. హద్దులు ఏమిటో.. తెలుసుకోవడం దుర్లభం. సాధారణంగా అయితే భూమిని చదును చేసి, లే ఔట్ వేసిన తరువాత ఇళ్ల స్థలాలకు మార్కింగ్ ఇవాల్సి ఉంది. అవేవీ చేయకుండానే ఏకంగా ఇళ్ల పట్టాలు మంజూరు చేసేశారు. పట్టాలు మంజూరు చేసిన భూమి చూస్తే ఇక్కడ ఇళ్లు కట్టుకునేదీ ఎలా అనే ప్రశ్నలు లబ్దిదారుల నుంచి ఎదురవ్వక తప్పవు మరి.

ఇటీవల ఇళ్లపట్టాలు పంపిణీ

మండలంలోని కట్టకిందపల్లి, ఆలమూరు, పాపంపేట, కొడిమి, నరసనాయనికుంట, చిన్నంపల్లి, కామారుపల్లి పంచాయతీ పరిధిలోని 500 మందికి పైగా ఇళ్ల పట్టాల మంజూరు చేశారు. గత నెల 17న పాపంపేటలో పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో ఆలమూరు పరిధిలో 64 మందికి, కట్టకిందపల్లిలో 77 మందికి, చిన్నంపల్లిలో ఆరుగురికి, కామారుపల్లిలో 39 మందికి, పాపంపేట పరిధిలోని 266 మందికి, కొడిమిలో 80 మందికి, నరసనాయనికుంటలో 38 మంది లబ్ధిదారులకు కొడిమి గ్రామ సమీపంలో ఇళ్లపట్టాలు మంజూరు చేశారు. కాగా నరసనాయనికుంట, కొడిమి, పాపంపేట పరిధిలోని లబ్ధిదారులకు కొడిమి గ్రామ సమీపంలో స్థలాలు కేటాయించారు. గ్రామ సర్వే నెంబరు 149,136 పట్టాలు మం జూరు చేశారు. పట్టాలు పొందిన వారు వా రికి కేటాయించిన భూమిని చూసి నివ్వె రపోయారు. ఆ భూమి చూసిన వారు ఇ క్కడ ఎలా ఇళ్లు కట్టుకునేదంటూ వాపో తున్నారు. కనీసం స్థలాలోకి వెళ్లేందుకు కూడా దారి లేదంటూ మండిప డుతు న్నారు. భూమి చదును కూడా చేయకుండా ఎందుకిచ్చారో ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు.

పశువా.. నీవైనా స్పందించవా..!

గేదెకు వినతిపత్రం అందజేసి అంగన్‌వాడీల నిరసన



నార్పల, శింగనమలలో గేదెకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు, కక్కలపల్లిలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : 'పశువా... నీవైనా స్పందించి మా సమస్యలు పరిష్కరించవా..' అంటూ అంగన్‌వాడీలు పలు ప్రాంతాల్లో మంగళవారం గేదెలకు వినతి పత్రాలు అందజేసి నిరసన తెలిపా రు. వీరు చేపట్టిన నిరసన మంగళవారానికి 22వ రోజుకు చేరింది. నార్పలలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీదేవి, రామాంజినమ్మ, రేణుక గేదెకు వినతి పత్రం అందజేశారు. శింగనమలలో గేదెకు వినతి పత్రం ఇచ్చిన అంగన్‌వాడీలు బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడి స్తున్నట్లు తెలిపారు. గార్లదిన్నెలో ప్రాజెక్టు కోశాధికారి లీలావతి, గార్లదిన్నె, కల్లూరు సెక్టార్లు ఫిరోదోజ్ బాను, రాజేశ్వరీ, ప్రమీల రాణి, శాంత కుమారి గేదెకు వినతి పత్రం అందజేశారు. వీరి సమ్మెకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సీపీఎం మండ లాధ్యక్షుడు చెన్నారెడ్డి సంఘీభావం తెలి పారు. చెన్నేకొత్త పల్లిలోనూ అంగన్ వాడీలు గేదె కు వినతిపత్రం అందజేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనం తపురం రూరల్ మండలంలోని కక్కలపల్లిలో అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు. ఈ కార్యక్ర మంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుర్యప్రభ, వరలక్ష్మి, సత్యవేణి, ఆయాలు సరోజమ్మ, స్వాతి, వనిత పాల్గొన్నారు.



సీకేపల్లిలో గేదెకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

మాధవ్ దారెటు..?



- శాంతకు ఎంపీ టిక్కెట్టు ఖరారుతో గోరంట్ల ఆశలు గల్లంతు
- ప్రయత్నాలు కూడా చేయని ఎంపీ
- అధిష్ఠానం తీరుపై సన్నిహితుల వద్ద ఆవేదన
- ప్రతిపక్ష నేతలను ఎంత విమర్శించినా ఏం లాభమని నిర్వేదం
- పదవి ఇస్తామని ఆహ్వానించి.. పట్టించుకోవడం లేదని ఆవేదన

హిందూపురం, జనవరి 2: రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీకి చెందిన సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు మళ్లీ టిక్కెట్టు దక్కించుకునేందుకు ఎవరి స్థాయిలో వారు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ముఖ్య నేతల ద్వారా పావులు కదిపారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ మాత్రం ఏ ప్రయత్నమూ చేయకుండా మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది. ఈసారి తనకు టిక్కెట్టు లేనట్లేనని నిర్ణయానికి వచ్చాడో, ఇక మాట్లాడి ప్రయోజనం ఏముంటుందని భావించారో ఏమో తెలియదు కానీ, మౌనం వహించారు. అప్పట్లో తనకు పదవి ఇస్తామని చెప్పడంతోనే పోలీసు ఉద్యోగం వదిలి, వైసీపీలో చేరాననీ, ఇప్పుడేమో పట్టించుకునే వారే లేరని సన్నిహితుల వద్ద ఆవేదన చెందుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీని నమ్ముకుని, ప్రతిపక్ష నేతలపై తీవ్ర విమర్శలు చేశాననీ, అయినా ఏం లాభమని వాపోయినట్లు చర్చ సాగుతోంది. బళ్లారి మాజీ ఎంపీ శాంతకు హిందూపురం ఎంపీ టిక్కెట్టు ఖరారైంది. ఈ నేపథ్యంలో ఆమె అధినేత జగన్ సమక్షంలో మంగళవారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పక్క పార్లమెంటు ప్రజాప్రతినిధిని ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం ప్రకటించినా.. మాధవ్‌కు మాత్రం ఎలాంటి పిలుపు కానీ, చర్చించడం కానీ జరగలేదని తెలుస్తోంది. దీంతో మాధవ్ లోలోపలే రగులుతున్నట్లు సమాచారం. అధినేత మాటవిని 2019లో పోటీచేశాననీ, అప్పట్లో ఏదో ఒక పదవి ఇస్తానని చెప్పడంతోనే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, రాజకీయాల్లోకి ప్రవేశించాననీ, ఐదేళ్లకే ఇలా అయితే భవిష్యత్తు ఎలా అని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఎంత విమర్శించినా.. ఏం లాభం?

ఇదే జిల్లాలో పోలీసు అధికారిగా పనిచేస్తూ 2019కి ముందు అప్పటి అధికార పార్టీ నేతలపై విమర్శలు చేయడం, తొడగొట్టడం, మీసాలు మెలివేయడానికితోడు కుల ప్రాతిపదికన మాధవ్‌ను వైసీపీలోకి ఆహ్వానించి, టిక్కెట్టు ఇచ్చారు. ఎంపీగా గెలవడంతో అధినేత జగన్‌పై భక్తి ప్రదర్శించుకునేందుకు తరచూ ప్రతిపక్ష నేతలపై మాధవ్ తీవ్ర విమర్శలు గుప్పించేవారు. ఈ పరిస్థితుల్లో ఆయనకు ఎలాంటి అవకాశం, హామీ లేకపోవడంతో ఐదేళ్లుగా ప్రతిపక్ష నేతలపై ఎన్నో విమర్శలు చేశాననీ, అయినా తనకు ప్రయోజనం ఏంటని లోలోపలే మదన పడుతున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ఏ ప్రజాప్రతినిధి విమర్శించనంత రీతిలో తాను మాట్లాడాననీ, అయినా అధిష్ఠానం తన గురించి ఆలోచించకపోవడం బాధాకరమని ఆయన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేవలం సర్వేల ప్రకారం తనకు అవకాశం లేదని పార్టీలోని కొంతమంది నేతలు చెప్పుకోవడం సరికాదని పేర్కొన్నట్లు తెలిసింది. సర్వేల ప్రకారమే టిక్కెట్లు కేటాయించినట్లయితే ఇదే జిల్లాలో కొంత మంది ఓడిపోతారని సర్వే ఫలితాలు వచ్చినా.. వారికే అవకాశం ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. కొంత మంది పార్టీలో ముఖ్యనేతలకు అనుకూలంగా ఉన్న వారికి సర్వేలు వ్యతిరేకంగా వచ్చినా టిక్కెట్టు ఇచ్చారనీ, పార్టీపై నమ్మకంతో ఐదేళ్లుగా తాను చేసిన కృషి నిష్ప్రయోజనమా అన్నది ఆయనలో మెదలుతున్న ప్రశ్న ఆయన సన్నిహితులు కొంతమంది బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేశారు.

శాంత చేరికతో ఆశలు గల్లంతు

కొన్ని రోజులుగా హిందూపురం ఎంపీ టిక్కెట్టు బోయ సామాజికవర్గానికి చెందిన మహిళకు ఇస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి మాజీ ఎంపీ బోయ శాంత.. ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకోవడం, ఆమెకు వెంటనే హిందూపురం టిక్కెట్టు ఖరారు చేయడం చకచకా జరిగిపోయాయి. ఆమె వెంట ఉన్న గుంతకల్లు ప్రాంతానికి చెందిన ఓ నాయకుడు కొంతకాలంగా హిందూపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. హిందూపురంలో ఇల్లు చూడాలని ఆమె సామాజికవర్గానికి చెందిన కొంతమంది నాయకులకు చెప్పినట్లు తెలిసింది. ఆమెకు టిక్కెట్టు ఖరారు చేయడంతో ఎంపీ గోరంట్ల మాధవ్‌కు దారులు మూసుకుపోయాయనడంలో సందేహం లేదు. బోయ శాంత గుంతకల్లు ప్రాంతవాసి. 2009లో బళ్లారి నుంచి బీజేపీ తరఫున ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. మాజీ మంత్రి బళ్లారి శ్రీరాములు సోదరి. ఈమెను పార్టీలోకి తీసుకునేందుకు ఇక్కడ ఓ పెద్దాయనతోపాటు ఓ ఎంపీ కీలకంగా వ్యవహరించారు. కర్ణాటకకు చెందిన బీజేపీ నేతలతోపాటు మరో మాజీ మంత్రి కూడా పనిచేసినట్లు తెలిసింది.

వైసీపీ నాయకులు కబ్జా చేశారు

- న్యాయం చేయండి.. లేకుంటే ఆత్మహత్యే శరణ్యం
- అధికారులను వేడుకున్న బసినేపల్లి రైతు



భూమిని చదును చేస్తున్న దృశ్యం, బాధిత రైతు హరిబాబు

చెన్నేకొత్తపల్లి, జనవరి 2: 'అయ్యా నాకు ఆ భూమి తప్పా వేరే జీవాధారం లేదు. కొందరు వైసీపీ నాయకులు అన్యాయంగా నా భూమిలోకి చొరబడి కాజేయాలని పన్నాగం పన్నారు. మీరే నాకు న్యాయం చేయండి.. లేదంటే నాకు చావే శరణ్యం...' అంటూ ఓ రైతు అధికారులను వేడుకున్న సంఘటన చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. టీడీపీ సానుభూతి పరుడు, బాధిత రైతు బీరే హరిబాబు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బసినేపల్లి ప్రధాన రహదారి ప్రక్కన 243-3బీ సర్వే నెంబరులో 18.50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 2018లో అప్పటి మంత్రిగా ఉన్న పరిటాల సునీత టీడీపీ కార్యకర్త బీరే హరిబాబుకు నాలుగు ఎకరాలు పట్టా చేసి పాసు పుస్తకాలు మంజూరు చేశారు. దీంతో అప్పటి నుంచి బీరే హరిబాబు భూమిని సాగుచేసుకుంటున్నాడు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే గ్రామానికి చెందిన కొందరు ఆ పార్టీ నాయకులు ఈ భూమి తమదంటూ చొరబడి రికార్డులను తారుమారు చేసి ఆ భూమిలోకి అతన్ని వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో 2023లో న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించారు. తుది తీర్పు ఇచ్చేంతవరకు ఎవరు భూమిలోకి వెళ్లరాదని కోర్టు స్టేకూడా ఇచ్చిందన్నారు. అయితే వైసీపీ నాయకులు కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ మంగళవారం యంత్రాలను పెట్టి చదును చేయించారు. దీంతో హరిబాబు అడ్డగించే ప్రయత్నం చేయగా దౌర్జన్యానికి దిగారు. దీంతో తనకు న్యాయం చేయాలని హరిబాబు రెవెన్యూ అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. దీనిపై తహసీల్దార్ షాబుద్దీన్‌ను వివరణ కోరగా.. డైక్‌లాట్ ప్రకారం ఆ భూమి పూర్వపట్టా అని తెలిసిందని, రికార్డులను పరిశీలించిన తరువాత వాస్తవం ఏమిటో తెలుస్తుందన్నారు. గతంలో ఆర్డీఓ ఉత్వర్వుల మేరకు గ్రామానికి చెందిన ఓ రైతుకు ఆన్‌లైన్ చేశామని, హరిబాబు భూమికి సంబంధించి ఏవైనా ఆధారాలు ఉంటే తీసుకుని రమ్మని సూచించామన్నారు.

బాలుర అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2: బాలుర అండర్-14 జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి మంగళవారం తెలిపారు. కెప్టెన్‌గా సాత్విక్, వెంకటకృష్ణ, జయ అశీష్ సాయి, కృష్ణసాయి, తన్మయి కార్తీక్ రెడ్డి, కౌశిక్, అభినవ్ సాత్విక్‌రెడ్డి, కిరణ్‌కుమార్, దేవాన్స్ రోహిత్, సంజయ్, లిఖిత్, సంతోష్, సాదిక్, ప్రాణధీర్, బాలాజీ, ఫణీంద్ర, స్టాండ్‌బైలుగా గోకుల్, వర్మీసర్, అమీర్ ఎంపికయ్యారన్నారు. బుధవారం నుంచి వెంకటగిరిలో నిర్వహించే శిక్షణా శిబిరంలో వీరు పాల్గొంటారన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు



ఆత్మసీతారామ ఆలయం వద్ద అక్షింతలతో భక్తులు

శింగనమల, జనవరి 2: స్థానిక ఆత్మసీతారామ ఆలయం నుంచి అర్చకులు సుబ్బరంగయ్య, లక్ష్మణ్‌రావు, ప్రవీణ్‌స్వామి ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలను మంగళవారం ఊరేగించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి గుమ్మానికి కుంకమ పెట్టి అక్షింతలను అందజేశారు. ఈ నెల 22న అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రతిష్ఠ తర్వాత ఈ అక్షింతలను ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సురేష్, రాజుగోపాల్, నారాయణస్వామి, రాంభూపాల్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, రాముడు, విజయ్‌శంకర్‌రెడ్డి, కరెంట్ సుబ్బయ్య, గురుస్వామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష రెండో విడత ప్రారంభం



రుద్రంపేటలో శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 2: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం నుంచి జిల్లాలో మొదలు పెట్టారు. తొలిరోజు జిల్లాలోని 15 మండలాలలో ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు నిర్వహించారు. కురుగుంటలో ఏర్పాటు చేసిన క్యాంపును కలెక్టరు గౌతమి పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవీ, డీసీహెచ్ఎస్ రవికుమార్, పలువురు వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్ : మండలంలోని రుద్రంపేటలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ గౌతమి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట ప్రోగ్రామ్ ఆఫీసర్ యుగంధర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, వైద్యుడు మనోజ్ ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు శ్రీసాయి విద్యార్థిని



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్, ఇతరులు

అనంతపురం విద్య, జనవరి 2: తమ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న దేదీప్య సాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ పుల్లారెడ్డి తెలిపారు. మంగళవారం ఆ విద్యార్థినిని అభినందించిన ఆయన మాట్లాడుతూ.. ఈనెల 8 నుంచి 15 వరకూ రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో దేదీప్య సాయి పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్లు రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ సాకే తిరుపాలు

రాప్తాడు, జనవరి 2: గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ నేత, సర్పంచ్ సాకే తిరుపాలు తెలిపారు. రాప్తాడులోని డ్రామా కట్ట వద్ద మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సావిత్రి మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు, గ్రామస్థులు గేటు సత్తి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని నిలదీసిన మహిళలు

గ్రామంలో మురుగు కాల్వలు సక్రమంగా పరిశుభ్రం చేయించలేదని, చెత్త, మురుగు ఎక్కడికక్కడే దుర్వాసన వస్తోందని మహిళలు పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని మండిపడ్డారు. తాగునీటి బోర్లు చెడిపోతే సకాలంలో పరిష్కరించడం లేదని, పనితీరు మార్చుకోవాలని సూచించారు.

వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా జానకి రామయ్య

అనంతపురం సెంట్రల్: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడిగా జానకి రామయ్య నియమితులయ్యారు. మంగళవారం ఆ సంఘం అధికార ప్రతినిధి పెద్దన్న అతనికి నియామక పత్రాన్ని అందజేశారు.



జానకి రామయ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న పెద్దన్న


పుట్లూరులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్


గుత్తిలో అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న పెన్షనర్లు


కళ్యాణదుర్గంలో గేదెదూడకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు


కళ్యాణదుర్గం పట్టణంలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


కుందుర్పిలో గేదెకు అంగన్‌వాడీల వినతిపత్రం


అంగన్‌వాడీ వర్కర్లకు మద్దతు తెలుపుతున్న సీపీఎం వ్యవసాయ కార్మికసంఘం నాయకులు (తాడిపత్రి)

వినూత్న నిరసన

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మె మంగళవారం 22వ రోజు కొనసాగింది. పలు చోట్ల అంగన్‌వాడీ వర్కర్లు భిక్షాటన చేస్తూ, గడ్డి తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం దున్నపోతులకు వినతి పత్రం అందించారు. వీరికి పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


బెళుగుప్పలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


గుంతకల్లులో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు


ఉరవకొండలో మాట్లాడుతున్న అంగన్‌వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి


గుమ్మఘట్టలో ఎస్‌ఐ సునీతకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


బొమ్మనహాళ్‌లో గేదెకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పత్తిని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి2: రైతులు పండించిన పత్తిని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పత్తిని సీసీఐ ద్వారా వెంటనే కొనుగోలు చేయాలంటూ సీసీఐ మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండేను ఎంపీ తలారి రంగయ్య, వైసీపీ నాయకులు మహాలక్ష్మిశ్రీనివాస్, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథ్‌రెడ్డి కలవడంపై ఆయన స్పందించారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేయడం వల్ల రైతులకు నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. పత్తి కొనుగోలుపై అనేక నిబంధనలను సీసీఐ పెడుతుందన్నారు. గతంలో తాడిపత్రిలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసినా విక్రయించేం దుకు రైతులు ఎవరూ ముందుకు రాలేదన్నారు. దీన్నిదృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేవిధంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

సమయానికి పింఛన్ ఇవ్వలేని ప్రభుత్వం


విలేకరులతో మాట్లాడుతున్న పెరుమాళ్ల జీవానందరెడ్డి

పామిడి, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ కూడా సమయానికి ఇవ్వలేని దుస్థితిలో ఉందని టీడీపీ నాయకుడు, పీజేఆర్ ట్రస్టు చైర్మన్ పెరుమాళ్ల జీవానందరెడ్డి విమర్శించారు. మండలంలోని గజరాంపల్లి గ్రామంలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పొద్దు పుట్టకనే వలంటీర్లు పింఛన్ పంపిణీ చేస్తున్నారని డప్పు కొట్టుకున్నారు. మరి ఇప్పుడు నెల ప్రారంభమై మూడు రోజులు కావస్తున్నా పింఛన్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రూ. 200లు నుంచి రూ. 2వేలకు పింఛన్ పెంచిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలుపై ఉన్న శ్రద్ధ పింఛన్‌పంపిణీపై లేదా అని ప్రశ్నించారు. అర్ధరాత్రి వరకూ మద్యం విక్రయించేందుకు అనుమతులు ఇచ్చిన వైఎస్ జగన్ ఎలా మద్య నిషేధం చేస్తారని ప్రశ్నించారు. సామాజిక సాధికార బస్సు యాత్రలకు జనం లేక తుస్సుయాత్రగా మారిందని విమర్శించారు. మా నమ్మకం నువ్వే జగన్ కాదు.. మా ఖర్మ నువ్వే జగన్ అంటూ జనం ఛీ కొడుతున్నారని ధ్వజమెత్తారు.

ఆస్పత్రిలో ఖాళీ వైద్య పోస్టులను భర్తీ చేయాలి


ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గుంతకల్లు టౌన్, జనవరి 2: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌కు బీజేపీ నాయకులు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతి చిన్న విషయానికి రోగులను అనంతపురం, కర్నూలుకు రెఫర్ చేస్తున్నారన్నారు. విధులకు వేళకు రాని వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. డ్యూటీ డాక్టర్ల పేర్లను నోటీసు బోర్డులో రాయాలన్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, ప్రధాన కార్యదర్శి జేసీ వెంకటేశ్వర్లు, బండారు క్రిష్ణమూర్తి, విజయలక్ష్మి, రాఘవ, శ్రీనివాసులు, కే శివ, సిరాజుద్దీన్, పద్మ, చిన్నకళావతి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మునిగిపోతున్న పడవ: కాలవ


భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న కాలవ శ్రీనివాసులు

డీ.హీరేహాళ్, జనవరి 2: వైసీపీ మునిగిపోతున్న పడవ అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. మండలంలోని ఎం హనుమాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారాన్ని చేపట్టాడని విమర్శించారు. ఈ నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల కాలంలో నిరంకుశ పాలన కొనసాగించి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసి రాక్షసానందం పొందుతున్నాడని మండిపడ్డారు. దీంతో ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. దీనికి తోడు వైసీపీ ఎమ్మెల్యేలు బహిరంగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అరాచకాలను ప్రజాక్షేత్రంలో బట్టబయలు చేస్తుండటంతో రోజు రోజుకి వైసీపీ బలం సన్నగిల్లుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి, పుష్పావతి నాగళ్లి, నారాయణస్వామి, మాజీ జడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీటీసీలు మురడి గంగాధర, మొండి మల్లికార్జున, సర్పంచ్ రామాంజినేయులు, తిప్పేస్వామి, తెలుగు యువత గోవిందనాయక్, వెంకటేశు, వన్నూరుస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

డీ.హీరేహాళ్, జనవరి 2: మండలంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని సోమలాపురం గ్రామానికి చెందిన కురుబ ఎల్లప్ప మంగళవారం తన ద్విచక్ర వాహనంలో కర్ణాటక రాంపురం వైపు నుంచి కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్‌ఐ రంగడు తన సిబ్బందితో అతడిని అడ్డుకున్నారు. తనిఖీలు చేయగా ఎనిమిది బాక్సుల్లో 480 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి తరలించినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలియజేశారు. ఈ తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ గంగన్న కానిస్టేబుళ్లు సురేష్, నాగరాజు, రామాంజినేయులు పాల్గొన్నారు.

సైకో పాలనకు స్వస్తి పలుకుదాం: ఉన్నం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

కళ్యాణదుర్గం, జనవరి 2: ఈ ఏడాది సైకో పాలనకు స్వస్తి పలుకుదామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి తెలిపారు. మంగళవారం మండలంలోని బాల వెంకటాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ప్రకటిచిన పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొల్ల వెంకటేశులు, పాపంపల్లి రామాంజినేయులు, శ్రీనివాస రెడ్డి, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

బాలాపురంలో బాబు ష్యూరిటీ


కరపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

పుట్లూరు, జనవరి2: మండలంలోని బాలాపురం పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, రవిచంద్రనాయుడు, ఓబులనాయుడు, రామాంజనేయులు, చంద్రశేఖర్‌నాయుడు, తీర్థమయ్య, నరసింహ, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జనను విజయవంతం చేయండి

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 2: బీసీవై పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రాయలసీమ సింహగర్జన విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా సమన్వయకర్త బీసీ సురేష్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను, కార్మికులను నట్టేట ముంచిందన్నారు. రైతు భరోసా, ఆడపడుచుల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్‌లో బీసీవై పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభాకర్, లింగారెడ్డి, యర్రిస్వామి, శ్రీధర్, రఘు, హేమంత్, కిష్టయ్య పాల్గొన్నారు.

పంచాయతీల నిధులను దోచేసిన ప్రభుత్వం

యాడికి, జనవరి2: వైసీపీ ప్రభుత్వం పంచాయతీల నిధులను దోచేసి గ్రామాలను అభివృద్ధికి దూరం చేసిందని పంచాయతీరాజ్ చాంబర్స్ జిల్లా అధ్యక్షుడు వేలూరు రంగయ్య విమర్శించారు. మంగళగిరిలో బుధవారం నిర్వహించనున్న పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర సదస్సుకు మండలంలోని పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల నిధులను ప్రభుత్వం దోచేయడంతో మురుగునీటి కాలువల నిర్వహణ, వీధిలైట్ల నిర్వహణ, తాగునీటి ట్యాంకుల నిర్వహణ, శానిటేషన్ సిబ్బంది వేతనాల కోసం గ్రామ పంచాయతీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వ చర్యలతో గ్రామ పంచాయతీలు అన్ని నిర్వీర్యమయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాగమునిరెడ్డి, రమేష్‌బాబు, గోపాల్‌నాయుడు, రామాంజనేయులు, శేఖర్, రాజారెడ్డి, రవిచంద్రచౌదరి, యుగంధర్, కుళ్లాయప్పనాయుడు, ఆంజనేయరెడ్డి, నాగరాజు, మహేష్ ఉన్నారు.

కార్మికులను అడ్డుకున్న మున్సిపల్ ఉద్యోగులు


తాత్కాలిక కార్మికులను అడ్డుకుంటున్న సమ్మె కార్మికులు

రాయదుర్గం, జనవరి 2: మున్సిపల్ ఉద్యోగులు చేపడుతున్న సమ్మె నేపథ్యంలో అధికారులు పారిశుధ్య నిర్వహణ కోసం పదిమంది కార్మికులను తాత్కాలికంగా నియమించుకుని పనులు ప్రారంభించారు. సమ్మెలో ఉన్న మున్సిపల్ ఉద్యోగులు విషయం తెలుసుకుని మంగళవారం వారిని అడ్డుకున్నారు. పట్టణంలోని వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడానికి కార్మికులను తీసుకొచ్చి అధికారులు పనులు చేయిస్తుండగా సమ్మెలో ఉన్న వారు వెళ్లి వారిని అడ్డుకుని వెనక్కు పంపించారు. అధికారులకు సమ్మెలో ఉన్న ఉద్యోగుల మధ్య వాగ్వాదం జరిగింది. శాంతియుతంగా సమ్మెలో ఉన్న తమకు అధికారులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కారం దొరికేంత వరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టవద్దని విజ్ఞప్తి చేశారు. దీంతో తాత్కాలికంగా పనులు చేయడానికి వచ్చిన కూలీలు కూడా అక్కడ నుంచి వెళ్లిపోయారు.

దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

కణేకల్లు, జనవరి 2: టీడీపీ పాలనలో దళితుల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని మండల టీడీపీ ఎస్సీ సంఘం నాయకులు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సారయ్యను కోరారు. టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి అంజిబాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మాల్యం ఎల్లప్ప తదితరులు ఈడీని కలిసి తమ సమస్యలను విన్నవించారు. ప్రధానంగా గత టీడీపీ హయాంలో దళితుల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులకు ఎలాంటి సంక్షేమ పథకాలను అందించలేదన్నారు. కావున గత పథకాలను తిరిగి పునరుద్ధరించేందుకు అధికారులు తమ వంతు కృషి చేయాలని వారు ఈడీని కోరారు.


గుత్తిలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు


గుంతకల్లులో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

28న విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

కుందుర్పి, జనవరి 2: ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు, వదాన్యజన సొసైటీ సంయుక్తంగా జనవరి 28న కుందుర్పి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి తిప్పేస్వామి తెలిపారు. కుందుర్పి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో జరిగే టాలెంట్ టెస్ట్ బ్రోచర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో మాట్లాడుతూ వదాన్యజన సొసైటీ సహకారంతో ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ టెస్టును 9, 10 తరగతుల విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న 400 విద్యార్థులకు మాత్రమే పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన ఉత్తమ ప్రతిభ కనబరచిన పది మంది విద్యార్థులను ఎంపిక చేసి నగదు బహుమతి, సర్టిఫికెట్, మెమెంటోలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు క్రిష్టప్ప, మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కేజీబీవీ ఎస్‌వో నిర్మల, ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు కోఆర్డినేటర్లు దిలీప్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు తిమ్మప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.


టాలెంట్ టెస్ట్ బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు, ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు సభ్యులు

డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

గుత్తి/ గుంతకల్లు టౌన్/ కళ్యాణదుర్గం/ తాడిపత్రి , జనవరి 2: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. వీరికి కళ్యాణదుర్గంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు, తాడిపత్రిలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారి సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


కళ్యాణదుర్గంలో మున్సిపల్ కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ఉమామహేశ్వరనాయుడు


సమ్మె చేస్తున్న కార్మికులతో జేసీ ప్రభాకర్‌రెడ్డి

జీడిపల్లిలో నీటి నిల్వ 0.825 టీఎంసీలు

బెళుగుప్ప, జనవరి 2: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 0.825 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 462 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 600 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు.

ప్రైవేట్ వ్యక్తులతో పనులు చేయించరాదు

గుంతకల్లుటౌన్, జనవరి2: సమ్మె నేపథ్యంలో ప్రైవేట్ వ్యక్తుల చేత పారిశుధ్య పనులను చేయించరాదని మున్సిపల్ కార్యాలయంలోని పలు సెక్షన్ల హెడ్‌లకు మంగళవారం మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం జేఏసీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఏపీలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలన్నారు. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగరాజు, చిన్న, వాసు, రమేష్, పెద్ద పెంచలయ్య, రామాంజినమ్మ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పుట్లూరు విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుట్లూరు, జనవరి2: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అనూహ్యరెడ్డి రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపి సౌత్ ఇండియన్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ట్రాఫిక్ ఫ్రీ బస్ వితవుట్ పొల్యూషన్ అంశంపై ప్రదర్శనలు చేసి క్షుణ్ణంగా వివరించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిందన్నారు. ఈమెను ఉపాధ్యాయులు అభినందించారు.

7న ముగ్గుల పోటీలు

తాడిపత్రిటౌన్, జనవరి2: పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో ఈనెల 7న పద్మశాలీయ సంఘం తరపున పద్మశాలీయ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని సంఘం సభ్యులు తెలిపారు. ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీలో పాల్గొనే మహిళలు ఈనెల 6లోపు పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. అదేరోజు సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ


అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

తాడిపత్రిటౌన్, జనవరి2: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో మంగళవారం సీతారామ సమేత అయోధ్య పూజిత అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేసినట్లు వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. అయ్యప్పస్వామి ఆలయం వద్ద నుంచి అక్షింతల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ రామాంజనేయులు, ప్రవచనాల ఉపన్యాసకులు జయదేవ్, బీజేపీ నాయకులు శింగరి లక్ష్మీనారాయణ, రంగనాథ్‌రెడ్డి, ఆంజనేయులు, రంగనాయకులు వీహెచ్‌పీ నాయకులు హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రిటౌన్, జనవరి2: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామం వద్ద డిసెంబరు 7న జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన బాలాజీ (54) మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు పుట్లూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన బాలాజీ గత నెల 7న ద్విచక్రవాహనంపై తాడిపత్రికి వచ్చి తిరుగు ప్రయాణంలో యర్రగుంటపల్లి గ్రామం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడి నుంచి బెంగళూరు తరలించారు. సోమవారం రాత్రి ఇంటికి తీసుకురాగా మంగళవారం మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య సరస్వతితోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తమ్ముడు వెంకటనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పీహెచ్‌సీకి కుర్చీల వితరణ

తాడిపత్రిటౌన్, జనవరి2: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న పీహెచ్‌సీకి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం 40కుర్చీలు అందజేశారు. రోగులు కూర్చోవడానికి వీలుగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశశ్వినికి కుర్చీలను అందించినట్లు అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్‌నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రమేష్, రాజానాయుడు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక


విద్యార్థి మహ్మద్ ఆరిఫ్

ఉరవకొండ,జనవరి2: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మహ్మద్ ఆరిఫ్ జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వీరన్న తెలిపారు. ప్రకాశం జిల్లా, కనిగిరిలో గత ఏడాది డిసెంబరులో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలో ఈ విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపాడు. త్వరలో కర్ణాటక రాష్ట్రం బిజాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బొమ్మనహాళ్, జనవరి 2: మండలంలోని నేమకల్లు గ్రామంలో మంగళవారం బొమ్మనహాళ్ పోలీసులు కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన రామాంజినమ్మ తన ఇంట్లో అక్రమంగా కర్ణాటక మద్యంను విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేయగా 65 టెట్రా ప్యాకెట్లు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లుగా ఎస్‌ఐ అన్నారు.